

ఖరీఫ్ వరి విత్తనాలు సిద్ధం

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

పాలకొండ: జిల్లాలో ఆర్‌బీకేల్లో ఖరీఫ్ వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. శుక్రవారం పాలకొండలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులతో సమీక్షించారు. ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు. రైతులు తమ ఆధార్‌కార్డుతో ఆర్‌బీకేల వద్దకు వెళ్లి విత్తనాలు పొందొచ్చని సూచించారు. ప్రస్తుతం కొన్ని రకాల విత్తనాలు వచ్చాయని, ప్రతి ఒక్క రైతుకు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలను అందించారు. ఏడీఏ కె.రత్నకుమారి, ఏవో వై.వాహిని తదితరులు పాల్గొన్నారు.

స్పెషలిస్టులు ఎక్కడ?

- జిల్లా కేంద్రాసుపత్రిలో కానరాని ప్రత్యేక వైద్య నిపుణులు
- ఐదేళ్ల కాలంలో వారి నియామకంపై దృష్టి సారించని వైసీపీ సర్కారు
- గుండె, కిడ్నీ, నరాల వ్యాధిగ్రస్థులకు తప్పని అవస్థలు
- అత్యవసర వేళల్లో పొరుగు జిల్లాలకు పరుగులు



(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు.. 15 మండలాలకు పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రే పెద్ద దిక్కు. 'మన్యం'లో ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో పాటు పక్కనే ఉన్న ఒడిశా నుంచి కూడా ఎంతోమంది ఇక్కడికి వస్తుంటారు. అయితే జిల్లాకేంద్రాసుపత్రిని ప్రత్యేక వైద్య నిపుణుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా గుండె, కిడ్నీ, నరాల సంబంధిత వైద్యులు ఇక్కడ లేకపోవడంతో అత్యవసర వేళల్లో ఆయా వ్యాధిగ్రస్థులు పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి విజయనగరం, విశాఖలో ఆసుపత్రికి చేరుకోవాల్సి వస్తోంది. దూరాభారంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాలకు చేరేలోపే ఒక్కోసారి వ్యాధిగ్రస్థులు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు.



పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రి

నిత్యం రద్దీ..

జిల్లా కేంద్రాసుపత్రి నిత్యం రోగులతో రద్దీగానే ఉంటుంది. ఇక్కడ రోజుకు సుమారు 1200 మంది వైద్యసేవల కోసం వస్తుంటారు. ఆసుపత్రిలో 150 పడకలు ఉన్నప్పటికీ సీజనల్ వ్యాధుల సమయంలో అవి ఏ మాత్రం చాలడం లేదు. సుమారు 300 పైబడి ఇన్ పేషెంట్లుగా ఉండే సమయంలో ఒక్కో మంచంపై ఇద్దరేసి రోగులు సర్దుకోవాల్సి వస్తోంది. ప్రత్యేక గదులు లేకపోవడంతో రోగి బంధువులకూ అవస్థలు తప్పడం లేదు. ఒక్కోసారి వారు ఆసుపత్రి బయట టెంట్లు వేసుకుని ఉండాల్సి వస్తోంది.

అప్‌గ్రేడ్ అయినా..

మన్యం జిల్లాగా ఏర్పడిన తర్వాత పార్వతీపురం ఏరియా ఆసుపత్రిని జిల్లా కేంద్రాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అయితే ఆసుపత్రి స్థాయిని పెంచిన వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులపై మాత్రం దృష్టి సారించలేదు. ప్రధానంగా ప్రత్యేక వైద్య నిపుణుల నియామకం చేపట్టలేదు. జిల్లాలో గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులతో పాటు సీతానగరం మండలం నిడగళ్లు, పార్వతీపురం మండలం పెదమరికి తదితర ప్రాంతాల్లో కిడ్నీ రోగులు అధికంగానే ఉన్నారు. నాటుసారా ప్రభావంతో లివర్ దెబ్బతిన్న రోగులు కూడా ఎంతోమంది ఉన్నారు. అయినప్పటికీ జిల్లాకేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంపై జిల్లావాసులకు ఇక్కట్లు తప్పడం లేదు.

● పేరుకే జిల్లా కేంద్రం తప్ప.. ఇక్కడ గుండె, కిడ్నీ, నరాల వ్యాధిగ్రస్థులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. హఠాత్తుగా ఎవరికైనా గుండె నొప్పి వస్తే ప్రథమ చికిత్స అనంతరం ఉరుకులు పరుగుల మీద పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి. బ్రెయిన్ స్ట్రోక్ తదితర బాధితులకు కూడా చికిత్స అందించేందుకు జిల్లాకేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణులు లేరు. కిడ్నీ రోగుల పరిస్థితి కూడా ఇంతే. గుండె, కిడ్నీ, నరాల సంబంధిత వ్యాధిగ్రస్థులను జిల్లా కేంద్రాసుపత్రిలో తక్షణ వైద్యసేవలు అందించిన తర్వాత విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సి వస్తోంది. వాస్తవంగా పార్వతీపురం నుంచి విశాఖ కేజీహెచ్ చేరేసరికి సుమారు నాలుగు గంటల నుంచి ఐదు గంటల సమయం పడుతుంది. అయితే లోపుగా రోగి ఆరోగ్య పరిస్థితి విషమించితే ఇక అంతే సంగతి.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ భవనాలు అందుబాటు లోకి వస్తే.. ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేక వైద్య నిపుణులతో పాటు వైద్య సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఎంఆర్‌ఐ స్కానింగ్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా ఏళ్లు గడుస్తున్నా.. భవన నిర్మాణాలు పూర్తికాక పోవడంతో ఆ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గుండె, కిడ్నీ , నరాలు వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణుల నియామకం కూడా ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆయా వ్యాధిగ్రస్థులకు జిల్లాకేంద్రంలో వైద్య సేవలు అందే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రత్యేక వైద్యనిపుణులు లేకపోవడంతో వారంతా విజయనగరం, విశాఖపట్నానికి తరలివెళ్లాల్సి వస్తోంది. ఐదేళ్ల కాలంలో దీనిపై వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించకపోవడంతో విశాఖపట్నం వెళ్లేలోపు అనేక మంది రోగులు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

వైద్య కళాశాల ఎక్కడ?

జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వ పాలనలో స్థల పరిశీలన జరిగింది. అయితే నేటికీ కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేశామని సీఎం జగన్ ప్రకటించారు తప్పితే దాని పనులపై మాత్రం దృష్టి సారించలేదు. వైద్య కళాశాల నిర్మాణానికి కనీస చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

పూర్తి కాని నాడు-నేడు పనులు

జిల్లా కేంద్ర ఆసుపత్రికి నాడు-నేడు కింద పనులు మంజూరు చేశారు. అయితే ఏపీఎంఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు వాటి పూర్తికి ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు రెండేళ్ల కిందట ప్రారంభించిన ఆసుపత్రి అభివృద్ధి పనులు కూడా ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో మౌలిక వసతుల సమస్య రోగులను వేధిస్తోంది.

ఐసీయూలో వైద్య నిపుణులేరీ?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకేంద్రాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసీయూ కేంద్రంలో ప్రత్యేక వైద్యులతో పాటు వైద్య సిబ్బంది లేరు. దీంతో ప్రస్తుతం పని చేస్తున్న డాక్టర్లే పెద్దదిక్కుగా మారారు. అటు ఐసీయూలో రోగులకు, ఇటు సాధారణ పేషెంట్లకు ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి వైద్యులే సేవలు అందించాల్సి వస్తోంది. దీంతో ఒక్కోసారి వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర వేళల్లో వైద్యులు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

త్వరలోనే నియామకం..

జిల్లా కేంద్ర ఆసుపత్రి ద్వారా గుండె, కిడ్నీ, నరాల సంబంధింత రోగులకు సంతృప్తికరంగా వైద్య సేవలను అందిస్తున్నాం. ఆయా వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులు మంజూరవ్వాల్సి ఉంది. త్వరలోనే వారి నియామకం జరుగుతుంది.

-వాగ్దేవి, సూపరింటెండెంట్, జిల్లా కేంద్రాసుపత్రి, పార్వతీపురం

సాలూరులో కొలువుదీరేదెవరో?


- టీడీపీ, వైసీపీ మధ్య తీవ్ర పోటీ
- ఇద్దరు అభ్యర్థుల్లోనూ ధీమా
- గెలుపోటములపై సర్వత్రా చర్చలు
- శ్రేణులు, ప్రజల్లో ఉత్కంఠ
- నోటా ఓట్లు ఎవరికి ముప్పో?

సాలూరు రూరల్, మే 31: సాలూరులో విజేత ఎవరు? ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఈ సారి ఆ పార్టీ జెండా ఎగురుతుందా? కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పగ్గాలు చేపడతారా? అన్నది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. టీడీపీ ఏర్పడిన తర్వాత 1989 మినహా 2004 వరకు టీడీపీ అభ్యర్థులు (బోయిన రాజయ్య, భంజ్‌దేవ్) వరుసగా ఇక్కడ విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్, 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రాజన్నదొర వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. అంతకముందు 2006లో కోర్టు తీర్పు ద్వారా ఎమ్మెల్యేగా ఆయన ఎంపిక కాబడ్డారు. అయితే ఈ సారి నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ మధ్య గట్టి పోటీ నెలకొంది. ఎవరి గెలుస్తారన్న దానిపై శ్రేణులు, ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎవరి లెక్కల్లో వారున్నారు. పందాలు కూడా అదేస్థాయిలో జరుగుతున్నాయి. సుమారు 17 సంత్సరాల తర్వాత సాలూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురుతుందా? లేక ఐదోసారి రాజన్నదొర ఎమ్మెల్యేగా ఎన్నిక కాబడతారా? అన్నది మరో మూడు రోజుల్లో తేలి పోనుంది. అయితే ఇరుపార్టీలూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కనీసం 5 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించగలమని టీడీపీ, వైసీపీ అభ్యర్థులు భావిస్తున్నారు.


సంధ్యారాణి (టీడీపీ)

ఇదీ పరిస్థితి..

సాలూరులో పోలింగ్ తదుపరి ఓటరు నాడిని ఎవరు సరిగా అంచనా వేయలేకపోతున్నారు. పలు సర్వేల ఫలితాలు కూడా ఇదే స్పష్టం చేస్తున్నాయి. కొన్ని టీడీపీకి, మరికొన్ని వైసీపీకి అనుకూలంగా ఉన్నాయి. మరోవైపు టీడీపీ, వైసీపీ నేతలు పోలింగ్‌స్టేషన్ వారీగా, మండలాల వారీగా ఓటింగ్‌పై అంచనాలు వేసుకుంటున్నారు. తమకే అనుకూలంగా ఓట్లు పడ్డాయని ఎవరికి వారు చెబుతున్నప్పటికీ ఏదో మూల కాసింత సందేహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టో, వైసీపీ పాలనపై ప్రజావ్యతిరేకత వల్ల టీడీపీ విజయం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ఆశాభావంతో ఉన్నాయి. వైసీపీ సర్కారు సంక్షేమ పథకాలే తమని గెలిపిస్తాయని ఆ పార్టీ వర్గాలు విశ్వాసంతో ఉన్నాయి. ఏదేమైనా సాలూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో సాలూరు పట్టణం టీడీపీ అనుకూలంగా ఉన్నట్టుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీ నేతలు టీడీపీ నాయకుల్లా పనిచేయకపోవడం, ఆది నుంచి సాలూరు పట్టణం ఆ పార్టీ అనుకూలంగా ఉండడం దీనికి కారణమని వారు తెలియజేస్తున్నారు. మెంటాడ మండలంలో టీడీపీకి మెజార్టీ ఓట్లు లభిస్తాయని వైసీపీ నేతలు సైతం అంచనా వేస్తుండడం విశేషం. సాలూరు, మక్కువ మండలాలు వైసీపీకి అనుకూలంగా ఉంటాయని రాజకీయ పరిశీలకుల అంచనా. పాచిపెంటలో ఇరు పార్టీలకు సమానంగా ఓట్లు పోలయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో 1,446 వరకు పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు పోలయ్యాయి. వాటిల్లో అత్యధిక ఓట్లు టీడీపీకి లభించే అవకాశముంది. నోటా భయం సైతం అభ్యర్థులను వెంటాడుతోంది. ఏదేమైనా మండలాల వారీగా అంచనాలు కట్టి.. 'మేమే గెలుస్తాం' అని టీడీపీ, వైసీపీ వర్గాలు అనుకుంటున్నాయి.







గత ఎన్నికల్లో ఫలితాలు ఇలా..

2009లో టీడీపీ అభ్యర్థిగా గుమ్మిడి సంధ్యారాణి, కాంగ్రెస్ అభ్యర్థిగా పీడిక రాజన్నదొర పోటీ చేశారు. అప్పట్లో 1,20,950 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్ అభ్యర్థి రాజన్నదొరకు 49,517 ఓట్లు, సంధ్యారాణికి 47,861 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్లు రాజన్నదొరకు 478, సంధ్యారాణికి 225 లభించాయి. ఆ ఎన్నికల్లో రాజన్నదొర 1,656 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014లో 1,34,355 ఓట్లు పోలవ్వగా, వైసీపీ అభ్యర్థి రాజన్నదొరకు 63,472 ఓట్లు, టీడీపీ అభ్యర్థి ఆర్పీ భంజ్‌దేవ్‌కు 58,546 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్లు రాజన్నదొరకు 283, భంజ్‌దేవ్‌కు 212 లభించాయి. 2019లో ఎన్నికల్లో 1,52,004 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రాజన్నదొరకు 78,430 ఓట్లు, టీడీపీ అభ్యర్థి భంజ్‌దేవ్‌కు 58,401 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్లు రాజన్నదొరకు 814, భంజ్‌దేవ్‌కు 316 లభించాయి. ఈ ఎన్నికల్లో రాజన్నదొర 20,029 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో సాలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి , వైసీపీ అభ్యర్థి రాజన్నదొర మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే విజయానికి పోస్టల్ బ్యాలెట్‌తో సహా ప్రతి ఓటు కీలకం కానుంది. సాలూరు గద్దె నెక్కేదెవరో కొద్దిరోజుల్లో స్పష్టం కానుంది.


రాజన్నదొర (వైసీపీ)

స్నేహితుడే చంపేశాడు!

- వీడిన హత్య కేసుల మిస్టరీ
- తొలుత మిత్రుడిని... ఆ తర్వాత ఆయన భార్యను కడతేర్చిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

పాలకొండ: సీతంపేట మండలం పులిపుట్టి గ్రామ సమీపంలోని ఎర్ర చెరువు వద్ద కొద్ది రోజుల కిందట జరిగిన గుర్తు తెలియని మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలో డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. 'ఒడిశా రాష్ట్రం రుగడకు చెందిన జోసెఫ్ బుయాన్, మైఖేల్ ఇరువురు స్నేహితులు. బుయాన్ మైఖేల్‌కు ఎరవేసి తను నాణేల వ్యాపారం చేస్తున్నానని చెప్పి రూ.లక్ష తీసుకున్నాడు. తను కడుతున్న గృహానికి బుయాన్ ఆ మొత్తం వినియోగించాడు. ఆ తర్వాత మైఖేల్ డబ్బులు అడగ్గా బుయాన్ తిరిగి ఇవ్వలేదు. నాణేలు కూడా ఇవ్వలేదు. ఆ తర్వాత బుయాన్ మైఖేల్‌ను హత్య చేశాడు. పోలీసులకు దొరికిపోతాననే భయంతో ఆ తర్వాత మైఖేల్ భార్య రూట్ బుయాన్‌ను సీతంపేట మండలం పులిపుట్టి గ్రామ సమీపంలోని ఎర్రచెరువు వద్దకు తీసుకొచ్చి కత్తితో దారుణంగా హత్య చేశాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి సీతంపేట, పాలకొండ పోలీసులు నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఒక ఒక కేసు కోసం దర్యాప్తు చేస్తున్న వారు మరో హత్య కేసు కూడా ఛేదించారు. ఒడిశాలో జోసెఫ్ బుయాన్‌ను చాకచక్యంగా పట్టుకున్నారు. పాలకొండకు తీసుకొచ్చి విచారణ చేపట్టారు. కాగా తాను రెండు హత్యలను చేసినట్టు జోసెఫ్ బుయాన్ అంగీకరించాడు. అనంతరం నిందితుని నుంచి హత్యలకు వాడిన కత్తి, నాణేం, మైఖేల్ వద్ద తీసుకున్న లక్షల రూపాయలను పోలీసులు మీడియా సమక్షంలో ప్రదర్శించారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపుతాం' అని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీఐ చంద్రమౌళి , క్రైమ్ పోలీసులను ఆయనతోపాటు విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. ఈ సమావేశంలో పాలకొండ, సీతంపేట ఎస్‌ఐలు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ ఎం.జగదీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వర్షం

- జిల్లాలో విభిన్న వాతావరణం
- వానతో ఊరట చెందిన ప్రజలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా వీరఘట్టం ప్రధాన రహదారి


సాయంత్రం భామినిలో వర్షం కురుస్తున్న దృశ్యం


(గుమ్మలక్ష్మీపురం/భామిని/వీరఘట్టం/పాలకొండ)

జిల్లాలో శుక్రవారం విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండడంతో ప్రజలు విలవిల్లాడిపోయారు. అయితే సాయంత్రానికి మాత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వివిధ ప్రాంతాల్లో సుమారు గంట పాటు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడగా.. జిల్లావాసులు కాస్త ఊరట చెందారు. గుమ్మలక్ష్మీపురంలో వడగళ్ల వాన పడింది. గుమ్మలక్ష్మీపురం-కురుపాం రహదారి మధ్యలో ఉన్న మండ గ్రామ సమీపంలో ఈదురుగాలులకు భారీ చెట్టు నేలకొరిగింది. దీంతో గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామస్థులు స్పందించి భారీ చెట్టు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. భామిని, వీరఘట్టంలోనూ భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. పాలకొండతో పాటు మండలంలో సాయంత్రం ఆరు గంటల నుంచి 7 గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో పాలకొండతో పాటు మండలంలోని పలు గ్రామాలు చీకటిలోనే ఉండాల్సి వచ్చింది.


గుమ్మలక్ష్మీపురం: మండలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ చెట్టు

వడదెబ్బకు గురై వృద్ధుడి మృతి

మక్కువ: చెముడులో వడ దెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగి పోయారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కరణం కూర్మినాయుడు(67) రోజూలానే శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ పనులు చేస్తుండగా ఒక్క సారిగా కుప్పకూలి పోయాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుమార్తె, కొడుకు భోరున విలపించారు. ఇదిలా ఉండగా ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. మక్కువ వారపు సంతకు వచ్చిన గిరిజనులు చెట్లను ఆశ్రయించారు.


కూర్మినాయుడు (ఫైల్)

సినిమా చూడకుండానే రివ్యూ ఇస్తున్నారు



విష్వక్‌సేన్

'సినిమా చూసి నిజాయితీగా సమీక్ష రాయడంలో తప్పు లేదు. కానీ కొంత మంది సినిమా చూడకుండానే ఆ పని చేస్తున్నారు. మరికొందరు కావాలనే నెగెటివ్ రివ్యూలు రాస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రేక్షకులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాన్ని చూసేందుకు వస్తున్నారు' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా థియేటర్ల దగ్గర ప్రేక్షకుల సందడి కనిపించ లేదు. ఇప్పుడు మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కోసం మళ్లీ ప్రేక్షకులు థియేటర్ల బాట పడుతున్నారు. మా సినిమాకు వస్తున్న ప్రేక్షకాదరణకు చాలా ఆనందంగా ఉంది. 'విష్వక్ సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపుతార'ని ప్రశంసలు వస్తున్నాయి. నాలోని నటుడిగా సవాల్ విసిరేలా ఉంటేనే సినిమా చేయడం అలవాటు. ఇకముందు కూడా ఇలాంటి కొత్తదనం ఉన్న కథలతో వస్తాను' అన్నారు. 'బాల కృష్ణ గారు, వారి కుటుంబ సభ్యులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా బావుందని మెచ్చుకున్నారు. మంచి వసూళ్లు వస్తున్నాయని అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్లు ఫోన్ చేసి చెప్పారు. దీనికి త్వరలోనే సీక్వెల్ చేస్తాం' అని కృష్ణ చైతన్య చెప్పారు.

మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ

శర్వానంద్ హీరోగా నటించిన 35వ చిత్రం 'మనమే' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రకథానాయిక కృతి శెట్టి శుక్రవారం ఈ సినిమా విశేషాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేసిన నాకు ఈ పాత్ర చాలా కొత్తగా అనిపించింది. 'ఇంత స్ట్రిక్ట్‌గా ఉండాలా' అని దర్శకుడు శ్రీరామ్‌ను అడిగాను. అలాగే కావాలనడంతో ఆయన్ని ఫాలో అయ్యా.
- శర్వానంద్ అద్భుతంగా నటించారు. నిన్నే సినిమా చూశా. ప్రతి సీన్‌లో ఆయన అదరగొట్టారు. ఇందులో నా ఫేవరెట్ సీన్ ఒకటుంది. దాని కోసం చాలా వెయిట్ చేశా. ఎలా చేయాలా అని ఆలోచించా. కానీ శర్వానంద్ చాలా క్యాజువల్‌గా వచ్చి ఒకే ఒక్క నిమిషంలో ఆ సీన్ చేయడంతో చాలా ఆశ్చర్యపోయా.
- స్ట్రాంగ్ ఎమోషన్స్ కలిగిన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ 'మనమే'. కిడ్, పేరెంట్ ఎమోషన్ కూడా ఉంది. గ్లోబల్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. శర్వానంద్, నేను, పాప.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. అందుకే 'మనమే' అని పేరు పెట్టారు.
- చిత్రం షూటింగ్ లండన్‌లో జరిగింది. అక్కడి వెదర్ ఎప్పటికప్పుడు మారిపోయేది. ఒక్కోసారి హఠాత్తుగా వర్షం పడేది. అటువంటి వాతావరణంలోనూ నిర్మాత చక్కగా ప్లాన్ చేయడం వల్ల షూటింగ్ బాగా జరిగింది.
- ప్రస్తుతం మూడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే ఓ మలయాళ సినిమా కూడా చేస్తున్నాను.



జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం

సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ థియేట్రికల్ ట్రైలర్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సుధీర్‌బాబుకు, టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సుధీర్‌బాబు రాంబోలా ఉంటాడు. ఇందులో జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం అని చెప్పడం ఆసక్తికరంగా ఉంది. రాయలసీమ యాస లో సుధీర్‌బాబు అద్భుతంగా మాట్లాడారు. ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ కావాలి' అని కోరారు. 'ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు సంపత్ నంది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'యాక్షన్ సినిమా చేయమని కృష్ణ గారు చాలా సార్లు చెప్పారు. ఈ సినిమా అయనకు ఆనందం కలిగిస్తుందని నమ్ముతున్నా. ఇండియన్ సినిమాలో 'హరోంహర' లాంటి బ్యాక్‌డ్రాప్ ఉన్న సినిమా రాలేదనే చెప్పాలి. యాక్షన్ సీన్లు టాప్ రేంజ్‌లో ఉంటాయి. నిర్మాతలు బాగా ఖర్చు పెట్టారు. దర్శకుడు సాగర్ ఈ సినిమా కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించారు' అని చెప్పారు. జూన్ 14న సుధీర్‌బాబు మాస్ సంభవం చూడబోతున్నారని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/4uAYVEx లో చదవండి.



దిక్సూచి
DIKSUCHI

ఎంటెక్



సిడాక్-ఈఆర్‌డీసీఐఐటీ

తిరువనంతపురంలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)కు చెందిన ఈఆర్&డీసీఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఈఆర్‌డీసీఐఐటీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ ఇంజనీరింగ్(ఎంటెక్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా లైవ్ ప్రాజెక్ట్ వర్క్‌లు, సిడాక్ ఆర్ అండ్ డీ ల్యాబ్స్‌లో ఇంటర్న్‌షిప్ ఉంటాయి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో వీఎల్‌ఎస్‌ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: వీఎల్‌ఎస్‌ఐ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. సైబర్ ఫోరెన్సిక్స్ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే నాన్ గేట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. వీరికి డిగ్రీ స్థాయిలో ఆరో సెమిస్టర్ వరకు వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 6
- **ఈ-మెయిల్:** erdciit@cdac.in
- **వెబ్‌సైట్:** http://erdciit.ac.in

మౌలానా ఆజాద్ వర్సిటీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి.

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఏఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 15
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 26 నుంచి
- **వెబ్‌సైట్:** https://manuu.edu.in

డా.వైఎస్సార్‌హెచ్‌యూలో డిప్లొమాలు

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి.

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్‌ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-సేవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్-02/2024) నోటిఫికేషన్ విడుదలైంది. కోర్సు 2025 జూలైలో ప్రారంభం కానుంది.

1. **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)
2. **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్

అర్హతలు: ఇంటర్(ఫిజిక్స్, మేథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టం పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 28

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 9, 10, 11

వెబ్‌సైట్: https://afcat.cdac.in/AFCAT/

యూపీఎస్సీ ఎన్‌డీఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. త్రివిధ దళాల్లో 2025 జూన్ 2 నుంచి ప్రారంభం అయ్యే 154వ కోర్సులో, 116వ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏసీ) కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. అర్హులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- యూపీఎస్సీ - నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(2)-2024

ఖాళీలు: మొత్తం 404. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-120) ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 34 ఉన్నాయి.

అర్హత: ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



వయసు: అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 2006 జనవరి 1కి ముందు, 2009 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

కోర్సులు: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 1

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

వెబ్‌సైట్: https://upsc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/gliKhrpలో చదవండి.





జిందాల్ చర్చలు విఫలం

కొత్తవలస: జిందాల్ కార్మిక సంఘాల నాయకులకు, యాజమాన్య ప్రతినిధులకు శుక్రవారం విజయనగరం డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికసంఘాల ప్రతిపాదనలకు యాజమాన్యం అంగీకరించకపోవడంతో ఇక తమ వద్ద చర్చలు అనవసరమని ఇక మీదట విశాఖపట్టణంలోని జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలోనే తేల్చుకోవాలని డీసీఎల్ స్పష్టం చేసినట్టు కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. కార్మికులకు పని కావాలంటే ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్ యూనిట్‌కు పంపిస్తామని యాజమాన్యం తెలిపింది. అక్కడ ఎంత వేతనం ఇస్తారు, వసతి సౌకర్యాలు విషయమై యాజమాన్యం స్పష్టమైన వివరాలు తెలియ చేయలేదన్నారు. కార్మిక సంఘాలు పెట్టి ఔన ఏ ప్రతిపాదనకు యాజమాన్యం అంగీకరించక పోవడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలలో యాజమాన్యం తరఫున గోపాలకృష్ణ దినేష్ శర్మ, కార్మిక సంఘాల తరఫున నెక్కల నాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలిలో హనుమజ్జయంతి

సాలూరు రూరల్ (బొబ్బిలి): బొబ్బిలి తారకరామ కాలనీలో జూన్ 1న అభయ ఆంజనేయ ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించనున్నట్టు శ్రీరామసేన ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపింది. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, ఆంజనేయునికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అర్చన, పూజలను నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నారాయణసేవ(అన్నప్రసాదం), సాయంత్రం హనుమాన్‌కు తిరువీధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరింది.

నేటి నుంచి ఎంటీఎస్ టీచర్లు మళ్లీ విధుల్లోకి..

సాలూరు రూరల్: విధుల నుంచి తొలగించిన 1998, 2008 ఎంటీఎస్ కాంట్రాక్ట్ టీచర్లను 2024-2025 విద్యా సంవత్సరానికిగాను జూన్ 1 నుంచి విధుల్లో తీసుకురావాలని పాఠశాల విద్యా ప్రిన్సిపల్ కార్యదర్శి పి.ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఎంటీఎస్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు సర్వీస్ బ్రేక్ ఇవ్వడానికి మే నెలలో తొలగించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 1998 ఎంటీఎస్ కాంట్రాక్ట్ టీచర్లు 472 మంది, 2008 ఎంటీఎస్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు 93 మంది ఉన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి వారి సర్వీస్‌ను రెన్యువల్ చేస్తూ వారిని విధుల్లోకి తీసుకోనున్నారు. వారి కాంట్రాక్టు గడువు జూన్ 1 నుంచి 2025 ఏప్రిల్ 30 కాలానికి పరిమితి విధించి విధుల్లోకి తీసుకోనున్నారు.

వీధి కుక్కల దాడిలో గేదె పెయ్యికు గాయాలు

వేపాడ: వేపాడలో గ్రామ సింహాలు రెచ్చిపోయి ఓ గెదె పెయ్యను తీవ్రంగా గాయపర్చాయి. గ్రామానికి చెందిన దువ్వాడ ఈశ్వరరావు కుటుంబానికి చెందిన గెదె పెయ్యపై వీధి కుక్కలు శుక్రవారం దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పెయ్యికి కట్టేసి ఉండడంతో వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని రైతు ఈశ్వరరావు తెలిపారు. చికెన్ కొట్టు వ్యాపారులు వ్యర్థ పదార్థాలను విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల వీటిని తింటున్న వీధి కుక్కలు వ్యర్థ పదార్థాలు దొరకని సమయాల్లో పశువులపైన, మనుషులపైనా దాడి చేసి గాయపరుస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, మండల స్థాయి అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

రాజాం రూరల్: రాజాంలోని పలు ప్రాంతాలకు శనివారం రక్షిత మంచినీటి సరఫరా జరగదని మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. పథకానికి సంబంధించిన పైపులైన్లు మర్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి కాలనీ, మెంటి పేట ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్, కొండంపేట, మాదిగవీధి, బొబ్బిలిరోడ్, తెల గవీధి, చాకలివీధి, వస్త్రపురికాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, మల్లిఖార్జున కాలనీ, లచ్చయ్యపేట తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని ఏఈ వెంకట్ వివరించారు. ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొండవలసలో కార్డన్ సెర్చ్

రేగిడి, మే 31: కొండవలస గ్రామంలో రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 53 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీలో రేగిడి, సంతకవిటి ఎస్‌ఐలు శ్రీనివాస్, వీరజనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

రక్షిత పథకం ఇంతేనా?

- పైపులైన్‌కు లీకులు
- నిర్వహణ పట్టని అధికారులు
- కొరవడిన పర్యవేక్షణ

రాజాం రూరల్, మే 31: జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఫలితంగా లక్షలాది లీటర్ల రక్షిత నీరు వృథా అవుతోంది. ప్రధాన పైప్‌లైన్ కొన్నిచోట్ల తరచూ బీటలు వారుతోంది. మరికొన్ని చోట్ల జాయింట్లు పటుత్వం కోల్పోతున్నాయి. ఫలితంగా తాగునీరు వృథా అవుతోంది. సకాలంలో గ్రామాలకు చేరలేని పరిస్థితి ఎదురవుతోంది.

● రూ.115 కోట్ల వ్యయంతో..

జిల్లా కేంద్రంతో పాటు నాలుగు మండలాల ప్రజల తాగునీటి అవసరాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి బొత్స సత్యనారాయణ 2004లో నాగావళి నది నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు వీలుగా భారీ రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేయించారు. దీని కోసం ప్రభుత్వం అప్పట్లో రూ.115 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంతో శ్రీకాకుళం జిల్లా రేగిడి మండలం నాగావళి నది నుంచి విజయనగరం జిల్లాకు తాగునీరు సరఫరాకు ప్రాధాన్యమిచ్చారు.

● ఏఏ మండలాలకు అంటే..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలోని కొన్ని గ్రామాలతో పాటు విజయనగరం పట్టణంతో పాటు చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, నెల్లిమర్లకు ఇక్కడి నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. పైపులైన్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు గడవడంతో ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. కొన్నిచోట్ల పైపులైన్లు బీటలు వారుతున్నాయి. పైపుల జాయింట్ల వద్ద వాషర్లు అరిగిపోవడం వంటి చిన్నపాటి సమస్యల వల్ల తాగునీరు వృథా అవుతోంది. ఫలితంగా సరిపడినంత తాగునీరు ప్రజలకు చేరడం లేదు. జి.ఎం.ఆర్. కేర్ హాస్పిటల్ ప్రాంతంలో పలుమార్లు పైప్ లైన్లు బీటలు వారాయి. బొద్దాం గ్రామం దాటిన తరువాత కూడా పైపులైను పగిలిపోయి.. తాగునీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. సుమారు నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా.. మరమ్మతులు చేపట్టలేదని బొద్దాం గ్రామస్తులు చెబుతున్నారు.



రోడ్డుపై వృథాగా రక్షితనీరు

● కొరవడిన పర్యవేక్షణ

పథకం విషయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లాలో విలీనం కావడానికి పూర్వం పథకం నిర్వహణ బాధ్యతలు విజయనగరం ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారుల పరిధిలో ఉండేది. విలీనం తరువాత దీని మరమ్మతుల విషయాన్ని అధికారులు కనీసం పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా దీనిపై యంత్రాంగం దృష్టి సారించి...పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



రాజాం - చీపురుపల్లి రోడ్‌లో బొద్దాం వద్ద పైపులైన్‌కు ఏర్పడ్డ లీకేజీ

సిమెంట్ కొరతతోనే ఆలస్యం: డీఈవో

లక్కవరపుకోట, మే 31: సిమెంట్ కొరత వల్లే నాడు-నేడు పనుల్లో జాప్యం జరుగుతోందని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలను పరిశీలించారు. అనంతరం పుస్తకాల స్టాక్‌ను చూశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 15 మండలాలకు సిమెంట్ వచ్చిందని.. కొద్దికొద్దిగా సర్దుబాటు చేస్తున్నామని తెలిపారు. ఇంకా పది మండలాలకు రావలసి ఉందన్నారు. ఈ ఏడాది 63 పాఠశాలలు సీబీఎస్ఈలో చేరుతున్నాయని తెలిపారు. ఏడు పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది నుంచి మార్క్‌షీట్స్‌లో ఎటువంటి తప్పులు దొర్లినా హెచ్ఎం ద్వారా దరఖాస్తు చేస్తే వెంటనే సరిచేస్తామన్నారు. దీనికోసం ఈనెల 10లోగా దరఖాస్తు చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో కూర్మారావు తదితరులు ఉన్నారు.



స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న డీఈవో

లారీని ఢీ కొట్టిన అంబులెన్స్

● డ్రైవర్, టెక్నీషియన్‌తో సహా రోగి బంధువులకు గాయాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మే 31: లారీని అంబులెన్స్ ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవరతో పాటు, మెడికల్ టెక్నీషియన్, రోగితో పాటు వస్తున్న ముగ్గురు బంధువులకు తీవ్రగాయాలయ్యాయి. బాడంగి మండలం నుంచి విజయనగరం పెద్దాసుపత్రికి రోగిని తీసుకువస్తున్న అంబులెన్స్ విజయనగరం సమీపంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల వద్ద ముందు వెళ్తూ, స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆగిన లారీని అంబులెన్స్ వెనుకనుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనలో డ్రైవర్ నాగరాజు, రాంబాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరికి పెద్దాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గాయాలపాలైన పేషెంట్‌కు, బంధువులకు చికిత్స అందిస్తున్నారు. పేషెంట్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.



నుజ్జునుజ్జయిన అంబులెన్స్, గాయపడిన వారిని తరలిస్తున్న దృశ్యం

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్లు మార్చడానికి తవ్వకాలు చేసిన దృశ్యం

రాజాం, మే 31: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి గుడి వెనక భాగంలో రక్షిత మంచిటి పథకం పైపులైన్లకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఏఈ వెంకట్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. కొత్తపైపులను ఏర్పాటు చేశారు. శనివారం అవసరమైన సామగ్రి మొత్తం వస్తుందని..పూర్తి స్థాయిలో పనులు చేపడతామని ఏఈ తెలిపారు. మరమ్మతుల కారణంగా అమ్మవారి కాలనీ, మెంతిపేట, ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్, కొండంపేట, మాదిగ వీధి, చాలకలవీధి, వస్త్రపురి కాలనీ, గోపాలపురం, తిమ్మయ్యపేట, మల్లికార్జున కాలనీ, లచ్చయ్యపేట తదితర ప్రాంతాలకు ఆదివారం తాగునీటి సరఫరా ఉండదన్నారు.

సేవా కార్యక్రమాలే గుర్తింపునిస్తాయి

దాసన్నపేట, మే 31: జిల్లాలో పేద విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలే గుర్తింపునిస్తామని కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్టు అధినేత కనకల రఘురామారావు అన్నారు. శుక్రవారం కనకల శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు, మిఠాయి, రొట్టెలు పంపిణీ చేశారు. ఏటా తమ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యా ర్థులకు ఆర్థిక సాయంతో పాటు పేద కుటుంబాలకు నిత్యావసర సరకులు, విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండలరావు, పుష్ప పుకుమార్ రెడ్డి, ప్రసాద్, వెంకటేష్, రామారావు, గిరి, మధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న రఘురామారావు

ముగిసిన విలువిద్య శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం రింగురోడ్డు : ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో వారధి-రామనారాయణం- ధనుర్విద్య పేరుతో చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ధనుర్వేదం వ్యవస్థాపకులు విభాకర్ తివారి గురుజీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. అనంతరం విలువిద్య పోటీలు నిర్వహించారు. విజేతలైన రవితేజ, కుశల్ కుమార్ గుప్తలకు బహుమతులు అందజేశారు. శిక్షణలో పాల్గొన్న 25 మందికి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి, నిత్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

విజయనగరం రింగురోడ్డు: హిందూ ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం శోభాయాత్ర నిర్వహిస్తున్నామని సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్, సహ అధ్యక్షుడు ఆబోతుల శ్యామ్‌సుందర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో వారు విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం కొత్తపేటలో గల కొత్తకోవెలలో పూజా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు కోట నుంచి మూడు లాంతర్లు, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా యాత్రను నిర్వహిస్తామన్నారు. అనంతరం హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శఠగోపం పార్థసారథి, రామ్‌తరుణ్ నాయుడు, అరవింద్, ఉదయ్, లోకేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తవలస, మే 31: చెట్టుపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన బాధితుని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి, తెలుగుదేశం నాయకులు శుక్రవారం పరామర్శించారు. మండలంలోని రెల్లి పంచాయతీ ముమ్మనవానిపాలెం గ్రామానికి చెందిన రాజాన దుర్గాప్రసాద్ అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త చెట్టుపై నుంచి కొద్ది రోజుల కింద పడిపోవడంతో వెన్నుపూస, మెదడు, చేతికి తీవ్రగాయాలు కావడంతో విషయం తెలుసుకున్న లలిత కుమారి బాధిత కుటుంబానికి 35 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో లలిత కుమారితో పాటు నాయకులు కేబీపీ రాంప్రసాద్, గొరపల్లి రాము, కోళ్ల వెంకటరమణ, లెంక శ్రీను, విరోతి శివాజీ, నక్కరాజు చినరాము, యల్లపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న కోళ్ల

చికిత్స పొందుతూ యువతి మృతి



అనిత (ఫైల్)

సీతంపేట: మండలంలోని కొత్తగూడ పంచాయతీ పరిధిలో ఉన్న వంబవెల్లి గ్రామ సమీపంలో ఈనెల 27న ఆటోబోల్తా పడిన సంఘటనలో తీవ్రగాయాలపాలైన సవర అనిత(26) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. గత ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. సోమవారం సీతంపేటలో జరిగే వారపు సంతకు వచ్చి తిరుగు ప్రయాణంలో అదుపు తప్పి ఆటో లోయలో పడిపోవడంతో 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో సవర కార్తీక్ చికిత్స నిమిత్తం సోమవారం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అనిత గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త పిల్లలు ఉన్నారు. ఇదే ఆటో ప్రమాదంలో తీవ్ర గాయలపాలైన సవర లక్ష్మి ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని కేజీహెచ్‌కు చెందిన ఆరోగ్యమిత్ర స్పష్టం చేశారు.

హోంగార్డుపై అత్యాచార కేసు నమోదు

విజయనగరం క్రైం, మే 31: జిల్లా కేంద్రం దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం హోంగార్డు రాజ్‌కుమార్‌పై అత్యాచార కేసు నమోదైనట్లు దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మాంకు చెందిన రాజ్‌కుమార్ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 28న పోలీస్ వాహనంలో విజయనగరం వచ్చి అనంతరం విజయనగరం నుంచి కుమిలి, పూసపాటిరేగ మీదుగా శ్రీకాకుళం వైపు వెళ్తుండగా అదే సమయంలో విజయనగరంలోని లంకవీధి, జొన్నగుడ్డు ప్రాంతానికి చెందిన ఓ జంట ద్విచక్రవాహనంపై అదే రహదారిలో పూసపాటిరేగ వైపు వెళ్తున్నారు. గుణుపూర్‌పేట డంపింగ్ యార్డు సమీపానికి వచ్చేసరికి హోంగార్డు వారి ద్విచక్రవాహనాన్ని అడ్డగించి ఆ జంటను బెదిరించి సమీప నిర్మాణుష్యమైన తోటలోకి తీసుకెళ్లి మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ జంట తేరుకుని డెంకాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డెంకాడ పోలీసులు సంబంధిత కేసును దిశ పోలీస్ స్టేషన్‌కు రిఫర్ చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించి అత్యాచారానికి పాల్పడ్డ హోంగార్డును గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

జారిపడి వ్యక్తి మృతి

రాజాం రూరల్, మే 31: మండల పరిధిలోని వి.ఆర్.అగ్రహారం గ్రామానికి చెందిన బంగారు రామచంద్రరావు (54) రాజాంలోని చీపురుపల్లి రోడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో జారిపడి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు రాజాం ఎస్.ఐ. రవికిరణ్ తెలిపారు. బంక్‌లో కొంతకాలంగా పనిచేస్తున్న రామచంద్రరావు శుక్రవారం ఉదయం బాత్‌రూంకి వెళ్లి వచ్చే సమయంలో జారిపడ్డంతో తలకు గాయం తగిలినట్లు ఎస్.ఐ. తెలిపారు. బంక్ సిబ్బంది సపర్యలు చేసినా ఫలితం దక్కలేదని పేర్కొన్నారు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. రవికిరణ్ పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళకు గాయాలు

పార్వతీపురం టౌన్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్కువ మండలానికి చెందిన సిరికి కృష్ణవేణి పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ నుంచి శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం వెళ్లేందుకు సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. ఈ ప్రమాదంలో ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన రైల్వే పోలీసులు ఆమెను రక్షించి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

● ఇద్దరి పరిస్థితి విషమం

భోగాపురం, మే31: రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. సవరవల్లికి చెందిన బోరరమేష్, గారిగణేష్, బోరజగన్ ముగ్గురు కలిసి శుక్రవారం మధ్యాహ్నం తగరపువలస వెళ్లి అక్కడి నుంచి తిరిగి ఒకే ద్విచక్రవా హనంపై సవరవల్లి వైపు వస్తున్నారు. అదే సమయంలో స్థానిక ఓ రిసార్ట్‌లో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన జావేద్ అక్తర్ సవరవల్లి నుంచి పోలిపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలిపల్లి సమీపానికి వచ్చేసరికి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న బోరరమేష్, జావేద్ అక్తర్ తీవ్రంగా గాయపడడంతో వారి పరిస్థితి విషమంగా తయారైంది. వీరిని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక తగరపువలస లోని ఓ ఆసుపత్రికి తరలించారు. దీంతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న బోర రమేష్, జావద్‌అక్తర్‌కి తీవ్రగాయాలు కావడంతో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందులో ఇద్దరు తగరపువలస, మరో ఇద్దరు విజయనగరం ప్రేవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వడిస్సాకి చెందిన జావద్‌అక్తర్ ప్రేవేటు రిసార్ట్సులో పని చేస్తున్నాడు. దీనిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని సీఐ రవికుమార్ తెలిపారు.

భోగాపురంలో చోరీ

భోగాపురం, మే 31: మండలం ముంజేరు పంచాయతీ గాబువానిపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన నక్కా రమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఇంటి మేడపై నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలకొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తెరిచి అందులో ఉన్న రెండుతులాల బంగారు ఆభరణాలు, రూ.10వేలు నగదు దొంగిలించుకు పోయారు. అయితే ఉదయం నిద్రలేచి డాబాపైనుంచి కిందకి వచ్చిన రమ ఇంటి తాళాలు పగలుకొట్టి ఉండడంతో ఆశ్చర్యపోయి బీరువా చూడగా అందులో బంగారు ఆభరణాలు, నగదు లేనట్లు గిర్తించింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ వేసవి కారణంగా చాలా మంది డాబాలపై నిద్రిస్తుంటారని, దీనిని దొంగలు అదునుగా చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారన్నారు. అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకుగాని, 100కి గాని కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.



చోరీకి గురైన బీరువా

పొగతాగితే కేన్సర్ తప్పదు

- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అధికారుల ర్యాలీలు
- వినియోగం వద్దంటూ నినాదాలు

సాలూరు రూరల్(బొబ్బిలి), మే 31: పొగతాగితే క్యాన్సర్ వ్యాధి ముప్పు అధికమని రోటరీ క్లబ్ బొబ్బిలి అధ్యక్షుడు జేసీ రాజు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రి వద్ద పొగాకు ముప్పుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధూమపానం, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తుల విని యోగం వల్ల చేకూరే నష్టాలను వివరించారు. సరదాగా అలవాటు చేసుకున్న వ్యసనం ఆరోగ్యానికి చేటు తెచ్చి ఆర్థికంగా కుంగదీస్తుందన్నారు. సెలబ్రిటీలు ఆరోగ్యానికి హాని కలిగే ఉత్పత్తులకు యాడ్‌లు చేయకుండా నియంత్రణ పాటించాలని కోరారు. ఈ సందర్భంగా పొగాకు వల్ల చేకూరే నష్టాలపై గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అవినాష్, దుర్గ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం రింగురోడ్డు: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ పొగాకు నియంత్రణ శాఖ సంయుక్తంగా డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా మానవహారంగా ఏర్పడి పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అదనపు డీఈఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రాణి మాట్లాడుతూ 20 రోజుల పాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రచారానికి కార్యాచరణ ప్రణాళిక రచించినట్టు చెప్పారు విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డిమో వి.చినతల్లి, బి.మహాలక్ష్మి, సైకాలజిస్టు రమణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తవలస: పొగతాగడం ఆరోగ్యానికి హానికరమని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రి నాయుడు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా వియ్యంపేటలో అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా పొగాకు వినియోగం వలప ఎదురయ్యే అనర్థాలన ఆయన వివరించారు. పొగాకు వాడకం వలన వచ్చే అనర్థాలను వివరించేందుకు గాను ప్రపంచ ఆరోగ్య సంస్థ1988 సంవత్సరంనుంచి ప్రతి సంవత్సరం మే 31 వతేదిని పొగాకు వ్యతిరేఖ దినోత్సవంగా అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమైన క్యాన్సర్, గుండె జబ్బులకు, శ్వాశ కోస వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులుకు ప్రధాన కారణం పొగాకు వాడకమన్నారు. ప్రతి సంవత్సరం 70 లక్షల మంది ఈ కారణంగానే మరణిస్తున్నారన్నారు.అలాగే ముసిరాం, రామలింగాపురం, తుమ్మికాపల్లి గ్రామాలలో కూడా వైద్య సిబ్బంది ఆధ్వర్యలంలో ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహారావు, పద్మావతి, ఈశ్వరరావు, ఆశజ్యోతి, సత్యారావు,ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బొబ్బిలిలో..



విజయనగరంలో..



కొత్తవలసలో..

నత్తనడకన 'నాడు-నేడు'

- మరికొద్ది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం
- కొనసాగుతున్న అభివృద్ధి పనులు



బిటివాడలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

వీరఘట్టం: మరో పన్నెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. కానీ ఇప్పటికీ నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీరఘట్టం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులకుగాను నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు మాత్రం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. మరికొద్ది రోజుల్లో పాఠశాలలను పునఃప్రారంభించనున్న నేపథ్యంలో పనులు అర్ధాంతరంగా ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది లు ఎదుర్కోవాల్సి వస్తుంది. మండలంలోని బిటివాడ, కంబరవలస, తెట్టంగి జడ్పీ ఉన్నత పాఠశాలలకు రెండో విడత నాడు-నేడు పనులు మంజూరయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారిణి పగడాలమ్మ ఇటీవల ఆయా పాఠశాలలను సందర్శిం చి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా ఆ పనులు మాత్రం నెమ్మదిగా జరుగుతున్నాయి. పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తవుతాయో లేదోనని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ● ఈ విషయమై మండల విద్యా శాఖాధికారి ఆనందరావును సంప్రదించగా పాఠశాలల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జనరల్ ఏజెంట్ బార్నాల సీతారాం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు విషయంలో ఏజెంట్లు ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని పార్వతీపురం నియోజకవర్గ జనరల్ ఏజెంట్ బార్నాల సీతారాం కోరారు. శుక్రవారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆదేశాల మేరకు కౌంటింగ్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందరంగా సీతారాం మాట్లాడుతూ ఎవరితో ఎటువంటి ఘర్షణలు పడవద్దని, ఏదైనా సందేహం ఉంటే వెంటనే కౌంటింగ్ సిబ్బంది ద్వారా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వైసీపీవారు ఓట్ల లెక్కింపు టేబుల్ వద్ద ఎటువంటి గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించినా వెంటనే ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు కౌంటింగ్ వద్ద ప్రతిఒక్క ఏజెంట్ నియమ నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలి అడిగితే బెదిరింపు తగదు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నేత శ్రీనివాసరావు

సాలూరు రూరల్: ఉపాధి పథకంలో గతంలో చేసిన పనికి పెద్దవలస వాసులు కూలి అడిగితే సంబంధిత సిబ్బంది బెదిరింపులకు దిగడం తగదని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆక్షేపించారు. సాలూరు మండలం నార్లవలస పంచాయతీ పెద్దవలస, మూలవలస గ్రామాల్లో శుక్రవారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది వారాలుగా ఉపాధి కూలి చెల్లించకపోవడం సరికాదన్నారు. కొన్ని గ్రామాలకు పనులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో గెమ్మెల రామకృష్ణ, సోములు, ఈశ్వరరావు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంపై దాడి



విద్యుత్ కార్యాలయంలో ప్రజలు ధ్వంసం చేసిన సామగ్రి

రాయగడ: అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజల సహనానికి పరీక్ష పెట్టిన విద్యుత్ అధికారుల తీరుకు నిరసనగా స్థానిక రాణిగుడ మార్గంలోని వినియోగదారుల విద్యుత్‌సేవా కార్యాలయంలోని ఫర్నీచర్‌ను పలువురు ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో గంటలు గంటలు విద్యుత్ కోత విధిస్తున్నారు. ప్రశ్నిస్తే జవాబు చెప్పే నాథుడే లేకపోవడంతో విసుగు చెందిన ప్రజలు ఒక్కసారిగా కార్యాలయంపై దాడిచేశారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ ఇంజినీర్ దేవాశిష్ జెనా మాట్లాడుతూ రాణిగుడ ఫారం ప్రాంతంలో ఓవర్‌లోడ్ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజల ఇక్కట్లు తొలగించేందుకు ఈ ప్రాంతాన్ని విద్యుత్‌ఫీడర్‌కు అనుసంధానం చేసి సమస్యకు పరిష్కారం చూపే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ఒడిశా

అమ్మవారి సంబరాలకు శుభరాట



శుభరాట కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

రాయగడ: రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి సంబరాలు జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహించేందుకు పూజా కమిటీ సభ్యులు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం శుభరాట వేశారు. ఈ సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజా కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న డీఎంవో జగన్మోహనరావు



వీరఘట్టం: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో పద్మావతి

గరుగుబిల్లి: ఆరోగ్యానికి హానికరం చేసే పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి తెర్లి జగన్మోహనరావు కోరారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్దవోలు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు కారణంగా పలు అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. పొగ తాగే వారితో పాటు చుట్టూ ఉండే వారికి ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. శరీరంలోని ముఖ్య అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్యాన్సర్‌తో పాటు పలు దీర్ఘకాలిక రోగాలకు గురవుతారని తెలిపారు. శ్వాస సంబంధమైన సమస్యలు, దృష్టి సమస్యలు, పక్షపాతం, రక్తనాళాలు గట్టి పడటం, సంతానోత్పత్తి తగ్గడంతో పాటు ఎముకలు బలహీనపడతాయని ఆయన వివరించారు. పిల్లలు చెడు వ్యసనాలకు లోనవ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, రామచంద్ర, సూపర్‌వైజర్లు ఉదయకుమారి, వైద్య సిబ్బంది పార్వతి, మౌనిక, దుర్గాప్రసాద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వీరఘట్టంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి ప్రదీప్ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పొగాకు వినియోగం అనే వ్యసనాన్ని తరిమికొట్టేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా వేలాది మంది కుటుంబాల జీవితాలలో చీకటిని నింపుతున్న పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని, దీనిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని గుమ్మలక్ష్మీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మావతి సూచించారు. గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. పొగ తాగడం వల్ల కలిగే అనర్థాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్





మక్కువ: కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్ఐ నరసింహమూర్తి, బలిజిపేట: వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

మక్కువ: మండల కేంద్రంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు కార్డన్‌సెర్చ్‌ను నిర్వహించారు. వీధుల్లో ప్రతి ఇంటిని తనిఖీ చేసి, అనుమానితుల వివరాలపై ఆరా తీశారు. ద్విచక్రవాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్నందున ఎవరూ మారణాయుధాలు కలిగి ఉండరాదన్నారు. వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎవరూ గుంపులుగా ఉండరాదని, మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి ఎవరైనా అనుమానితులు వస్తే తమకు తెలియజేయాలన్నారు. అనధికార మద్యం, సారా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ● **బలిజిపేట:** గంగాడ, గళావల్లి గ్రామాల్లో శుక్రవారం బలిజిపేట, సీతానగరం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ వి.పాపారావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న సమయంలో అల్లర్లకు అవకాశం లేకుండా ఉండేందుకు కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఇంటి వద్దకే పింఛన్ ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం: ఈనెల పింఛన్లు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ఏపీ గిరిజన సంఘం నాయకుడు మండంగి రమణ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రతి పంచాయతీలో సచివాలయ సిబ్బంది ఉన్నారని, వీరి ద్వారా ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేస్తే రెండు రోజుల్లో పింఛన్లు పంపిణీ పూర్తవుతుందన్నారు. బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు వేయడం వల్ల పింఛనుదారులు, వృద్ధులు మండల కేంద్రంలో ఉన్న బ్యాంకులకు రావడం కష్టతరం అవుతుందన్నారు. గత నెలలో ఎన్నో బాధలు పడ్డారన్నారు. ప్రభుత్వం స్పందించి పింఛన్లను ఇంటింటికి వెళ్లి పింఛనుదారులకు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ● **గరుగుబిల్లి:** రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఉపయోగించి ఇంటి వద్దకే సామాజిక పింఛన్లు అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వలంటీర్లు లేకపోతే వ్యవస్థలు ఆగిపోతాయా, వలంటీర్ లేనప్పుడు పింఛన్ పంపిణీ చేయలేదా అని ప్రశ్నించారు. జూన్ నెలకు సంబంధించి ప్రతి లబ్ధిదారునికి సామాజిక భద్రత పింఛన్ ఇంటి వద్దకే ఇవ్వాలని కోరారు. వృద్ధుల అకౌంట్లో డబ్బులు వేస్తే ఎండ తీవ్రతకు ఇబ్బంది పడి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, కనుక ఎన్నికల కమిషన్ దృష్టి సారించి ఇంటింటికి లబ్ధిదారులకు అందించాలని కోరారు.

కిశోర బాలికలు పరిశుభ్రత పాటించాలి



జనవరివలసలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సాలూరు రూర్: కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలని సాలూరు సీడీపీవో బర్ల సత్యవతి సూచించారు. కూర్మరాజుపేట సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆమె శుక్రవారం జనవరివలస గ్రామంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోకపోవడం వల్ల మహిళల్లో రక్తహీనత అధికంగా కనిపిస్తోందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి, కార్యకర్తలు జరజాపు పార్వతి, పి.రామలక్ష్మి, యశోద, పద్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు నోటీసులు జారీ



ఉల్లిభద్ర సమీపంలో దుకాణ యజమానులకు నోటీసులు అందిస్తున్న పోలీసు సిబ్బంది

గరుగుబిల్లి: ఉల్లిభద్ర సమీపంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా పరిసర ప్రాంతవాసులకు గరుగుబిల్లి పోలీసులు శుక్రవారం ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ వై.అమ్మన్నరావు మాట్లాడుతూ ఉద్యాన కళాశాలలో లెక్కింపును పురస్కరించుకుని ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదన్నారు. నివాసాలు, దుకాణాలు, హోటళ్ల పరిధిలో కుటుంబ సభ్యులు తప్ప వేరే వ్యక్తులు ఉండకూడదని సూచించారు. జన సమీకరణకు అవకాశం ఉన్న కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపుకు సహకరించాలని కోరారు. లెక్కింపు ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు నెలకొనకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నిబంధనలు ధిక్కరిస్తే చట్టరిత్యా చర్యలు తప్పవన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో గీతాంజలి

సీతంపేట: మండలంలో కాన్పుతో ఉన్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో గీతాంజలి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో దోనుబాయి, కుశిమి, మర్రిపాడు వైద్యాధికారులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రిజం వారాంతపు సమావేశంలో భాగంగా మూడో కాన్పు అంతకన్నా ఎక్కువ కాన్పులు ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీఎం విజయకుమార్, ఈవోపీఆర్డీ కొండపల్లి సత్యం, వైద్యాధికారులు చాందిని, సత్యవేణి పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



సీతంపేట: వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీతంపేట: మండలంలో ఉన్న గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ పీడీ రాబర్ట్‌పాల్ తెలిపారు. శుక్రవారం సీతంపేట మండలం కుడ్డపల్లి సచివాలయ పరిధిలో రైతులకు రాయితీ పై వరి విత్తనాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాల యాల్లో రైతులు వరి విత్తనాలకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆ మేరకు విత్తనాలను పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకొండ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నకుమారి, మండల వ్యవసాయాధికారి ప్రియ శ్రీదేవి పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** స్థానిక రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ శుక్రవారం ప్రారం భించారు. మండలంలో 1,292 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు చేయగా 955.8 క్వింటాళ్లు వచ్చాయని చెప్పారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు వారి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిణి జె.సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి ఉత్సవాలు

గజపతినగరం: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు అర్చకుడు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. గణపతి పూజ, విశేష కలశార్చన, పంచామృతాభిషేకంతో పాటు 108 వెండి తమలపాకులతో వెండి పుష్పాలతో విశేష అర్చనలు నిర్వహిస్తామని తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

భోగాపురం: చేపలకంచేరు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ మాజీ మండల మహిళా అధ్యక్షురాలు మైలపల్లి పైడితల్లి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈమె మూడు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేసి ప్రజల నుంచి మన్ననలు పొందారు. మండలంలో టీడీపీకి మంచి సేవలు అందించారు. ఆమె పార్థివదేహాన్ని పలువురు నాయకులు సందర్శించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు



గరుగుబిల్లి: పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

గరుగుబిల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి తెర్లి జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని ఉద్దవోలు, దళాయివలస గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడేతో పాటు ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల పరిధిలో దోమల సంచారం ఉన్నట్లయితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు లార్వా నిరోధక రసాయనాలు పిచికారీ చేయిస్తున్నామని చెప్పారు. గృహాలకు ఆనుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా దృష్టి సారించాలన్నారు. అలాగే పరిసరాల్లో నీటి నిల్వలు నెలకొనకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గృహ వ్యర్థాలను కాలువల్లో వేయరాదని కోరారు. అధికారులు కార్యక్రమాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ● గరుగుబిల్లి మండలంలోని పలు పంచా యతీల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈ పనులను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు శుక్రవారం తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి చూపాలని కార్యదర్శులకు సూచించారు. ● **సాలూరు రూరల్:** సాలూరు మండ లంలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నట్టు ఎంపీడీవో ఫణింద్రకుమార్ శుక్రవారం తెలిపారు. మండ లంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నా మన్నారు. అలాగే రక్షిత తాగునీరు అందించడానికి ప్రత్యేక కార్యాచరణ చేశామని చెప్పారు. రక్షిత పథక ట్యాంకులు పరిశుభ్రం చేయిస్తున్నామని చెప్పారు. పైప్‌లైన్లు లీకుల్లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ఆదేశాలిచ్చామన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్‌ను చేపట్టామ న్నారు. పనితీరు బాగులేని పంచాయతీ కార్యదర్శులపై దృష్టిసారించామన్నారు.

క్లుప్తంగా..

అల్లర్లకు ఆస్కారం ఇవ్వొద్దు: సీఐ రవికుమార్



పోలీసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బలిజిపేట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం రూరల్ సీఐ రవి కుమార్ ఆదేశించారు. శుక్రవారం బలిజిపేట పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో భద్రతపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వి.పాపారావు, సీతానగరం ఎస్ఐ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో సమస్యలు



మాట్లాడుతున్న అచ్యుతరావు

సాలూరు రూరల్: గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణతో గొర్రెలు, మేకల పెంపకానికి కాపరులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రండి అచ్యుతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా చేసి కనీసం దారి లేకుండా చేస్తున్నారన్నారు. మూగజీవాలను ఎక్కడ మేతకు తీసుకెళ్లాలని ప్రశ్నించారు. కొండ తోవలు, చెరువు గట్టుపై మేతకు అవకాశం కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి నూతన మోటారు వాహన చట్టం

పాలకొండ: నూతన మోటారు వాహన చట్టం ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని, డివిజన్ ప్రజలంతా గమనించి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కొత్త నిబంధనల ప్రకారం జైలుశిక్ష, జరిమానా విధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, పాలకొండ, వీరఘట్టం ఎస్ఐలు ప్రశాంత్‌కుమార్, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

వేపాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో నిర్వహకులు ఏవిధమైన లోపాలకు తావివ్వకుండా మెనూ ప్రకారం నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారులు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు అన్నారు. ఈ మేరకు నిర్వహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీహెచ్ మాస్టర్ ట్రైనర్ జి.లక్ష్మి, నిర్వహకులకు శిక్షణ ఇచ్చారు.